సాక్షి
అనకాపల్లి
బుధవారం । 10 । ఏప్రిల్ । 2024



నృసింహుడికి విశేష పూజలు

ఉగాది పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
39.1/25.0

వాతావరణం

రాగల ఐదు రోజులు అకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత గౌరి తెలిపారు.

రంజాన్ వేళలు

అనకాపల్లి
ఇఫ్తార్
(బుధ)
6.15
నర్సీపట్నం
6.18

ఆలయాలకు ఉగాది శోభ



నక్కపల్లి: ఉపమాకలో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు (ఇన్సెట్) విశేష పూజలందుకుంటున్న స్వామివారు

నక్కపల్లి, అనకాపల్లి: ఉగాది సందర్భంగా మంగళవారం జిల్లాలోని దేవాలయాలు కళకళలాడాయి. భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి, తెలుగు సంవత్సరాది రోజున ఆలయాలను దర్శించి, ఏడాదంతా సుఖసంతోషాలతో గడవాలని పూజలు చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. కొండదిగువన ఉపాలయాల్లో, క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి ఆలయంలో, స్వామి వారి ఉత్సవమూర్తులకు నిత్యార్చనలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో టీటీడీ వారు క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనానికి అనుమతించారు. నామవరంలో ఉన్న నాడీ గణపతి ఆలయం, స్వయంభూ రామలింగేశ్వరాలయం, ఒడ్డిమెట్టలో లక్ష్మీగణపతి ఆలయాలకు, పాయకరావుపేటలో శ్రీ రాధా రుక్మిణి సమేత పాండురంగస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఆలయాల్లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. పండితులు పంచాంగ పఠనం చేసి, ఈ ఏడాది గ్రహస్థితి ఎలా ఉంటుందో వివరించారు.

నూకాంబిక సన్నిధిలో..

అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి బాలాలయంలో శ్రీచక్రానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి పంచాంగ పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలు స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.



అనకాపల్లి: నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్) బాలాలయంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారు

న్యూస్‌రీల్

బ్యాంకాక్‌కు విమాన సర్వీసులు పునఃప్రారంభం



ప్రయాణికురాలికి తొలి టికెట్ అందిస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజా రెడ్డి

గోపాలపట్నం: విమాన ప్రయాణికులకు శుభవార్త. వేసవి సీజన్‌లో ఎయిర్ ఏషియా విమానయాన సంస్థ బ్యాంకాక్‌కు సర్వీసును బుధవారం పునఃప్రారంభించింది. విమానాశ్రయం టెర్మినల్ భవనంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తొలి ప్రయాణికురాలికి స్వాగతం పలికి టికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తరువాత బ్యాంకాక్ సర్వీసు ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రయాణికులకు ఈ వేసవిలో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ సర్వీసు బుధ, గురు, శనివారాల్లో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రాత్రి 11.50 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి బ్యాంకాక్‌కు 4.15 గంటలకు చేరుకుంటుంది. బ్యాంకాక్ నుంచి రాత్రి 10.05 గంటలకు బయలుదేరి విశాఖకు రాత్రి 12.50 గంటలకు చేరుకుంటుంది.

బ్రూనై చేరుకున్న 'పహెరేదార్'



బ్రూనైలోని మురాకు చేరుకున్న భారతీయ తీర రక్షణ దళ నౌక సముద్ర పహెరేదార్ సిబ్బంది

సింధియా: ఇండియన్ కోస్ట్‌గార్డ్ పొల్యూషన్ కంట్రోల్ వెసెల్ సముద్ర పహెరేదార్ బ్రూనైలోని మురాకు చేరుకుంది. 2022లో కంబోడియాలో జరిగిన సమావేశంలో భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించినట్లుగా.. సముద్ర పహెరేదార్ ఆసియన్ దేశాలను సందర్శిస్తోందని నేవీ వర్గాలు తెలిపాయి. మూడు రోజుల పర్యటనలో భాగంగా సముద్ర కాలుష్య నివారణ, మారిటైమ్ సెర్చ్ అండ్ రెస్క్యూ, మారిటైమ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర అంశాలపై ఇరు దేశాల కోస్ట్‌గార్డ్ బృందాలు చర్చిస్తాయి. రెండు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని నేవీ అధికారులు వివరించారు. పునీత్ సాగర్ అభియాన్‌కి దోహదపడుతూ సముద్ర పహెరేదార్‌లోని 25 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్, అక్కడి యువజన సంస్థల సహకారంతో బీచ్ క్లీన్ కార్యక్రమం నిర్వహించారు.

హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్-కటక్-హైదరాబాద్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. హైదరాబాద్-కటక్(07165) స్పెషల్ హైదరాబాద్‌లో ఈ నెల 16, 23, 30వ తేదీల్లో (ప్రతీ మంగళవారాల్లో) రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.07 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కటక్-హైదరాబాద్(07166) స్పెషల్ కటక్‌లో ఈ నెల 17, 23, మే 1వ తేదీల్లో (ప్రతీ బుధవారాలలో) రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.37 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

జంప్ జిలానీలకు రాజపూజ్యం.. నమ్ముకున్న నేతలకు అవమానం

- అధినేతల దెబ్బకు ఆశావహులు అబ్బా
- ఏళ్ల తరబడి టీడీపీ, జనసేనలకు చాకిరీ
- తీరా ఎన్నికల వేళ దగా
- ఉగాది పూట ఉసూరుమన్న నాయకులు
- తమ భవిష్యత్తుకు గండి కొట్టారంటూ ఆవేదన



సాక్షి, విశాఖపట్నం: జంప్ జిలానీలకు రాజపూజ్యం.. నమ్ముకున్న నేతలకు అవమానం..! ఇది జనసేన, టీడీపీ నాయకులకు ఆ పార్టీల అధినేతలు ఇచ్చిన బహుమానం. ఉమ్మడి విశాఖ జిల్లాలో టీడీపీ, జనసేన పార్టీల కోసం ఏళ్ల తరబడి కొంతమంది నాయకులు పనిచేస్తున్నారు. ఈ ఎన్నికల్లో తమకు టికెట్ కచ్చితంగా వచ్చి తీరుతుందన్న నమ్మకంతో ఉన్నారు. తీరా సీట్ల ఖరారు చేసే సమయం వచ్చేసరికి వీరు అక్కరకు రాకుండా పోయారు. నమ్ముకున్న వారికి కాకుండా నిన్న గాక మొన్న పార్టీలో చేరిన వారికే అవకాశం కల్పించారు. కష్టపడి పనిచేసిన వారిని పక్కన పెట్టేశారు. ఎన్నికల వేళ తమ అధినేతలు కొట్టిన దెబ్బకు వీరంతా అబ్బా అంటున్నారు. ఇలాంటి వారంతా ఉగాది పండుగ వేళ తమ భవిష్యత్తును ఊహించుకుని ఉసూరుమంటున్నారు. తమకు రావలసిన అవకాశాలను పార్టీ ఫిరాయింపుదార్లు తన్నుకుపోయారంటూ ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ల బాధితుల లిస్ట్ పెద్దగానే ఉంది.

- విశాఖ దక్షిణ సీటును ఆ నియోజకవర్గానికి చెందిన సాధిక్, కందుల నాగరాజు, మూగి శ్రీనివాసరావు, టీడీపీ నేత గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్ ఆశించారు. కానీ ఇటీవలే వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలోకి జంప్ చేసిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కేటాయించారు.
- జనసేనలో పెందుర్తి సీటును ఆశించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారు. తీరా ఆ టికెట్‌ను వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన పంచకర్ల రమేష్‌బాబుకు ఇచ్చారు. దీంతో షాక్ తిన్న శివశంకర్ పత్తా లేకుండాపోయారు. ఇక టీడీపీలో అదే స్థానంపై గంపెడాశలు పెట్టుకున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి కూడా తీవ్ర అసంతృప్తికి లోనై అనారోగ్యం పాలయ్యారు.
- గాజువాక స్థానంపై నమ్మకం పెట్టుకున్న జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావుకు కాకుండా పొత్తులో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు కేటాయించడం ఆయనకు మింగుడు పడలేదు.
- భీమిలిలో పదేళ్ల నుంచి జనసేన కోసం కష్టపడుతున్న పంచకర్ల సందీప్‌కు సీటిస్తామని పవన్ హామీ ఇచ్చారు. కానీ ఆఖరు నిమిషంలో టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కేటాయించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదే స్థానాన్ని ఆశించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబుకు గట్టిగానే షాక్ తగిలింది.
- విశాఖ ఉత్తర స్థానాన్ని ఆశించిన జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్‌కు కూడా ఆశాభంగమే ఎదురవడంతో ఆమె ఉసూరుమంటున్నారు.
- అనకాపల్లి టికెట్ ఆశించి జనసేన ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న పరచూరి భాస్కరరావుకు ఝలక్ ఇచ్చి.. నిన్నగాక మొన్న చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు సీటిచ్చారు. దీంతో పరుచూరి ఆ పార్టీకో నమస్కారం అంటూ రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఇదే సీటును ఆశించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ డీలా పడ్డారు.
- మాడుగుల సీటు కోసం పార్టీలో పనిచేస్తున్న పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులను కాదని ఎన్ఆర్ఐ పైలా ప్రసాదరావుకు కేటాయించడంతో వీరిద్దరూ తమ అధినేత చంద్రబాబుపై గుర్రుగా ఉన్నారు.
- యలమంచిలి టీడీపీ సీటు తనదేనని ఆశించిన ప్రగడ నాగేశ్వరరావుకు షాకిచ్చి జనసేన సుందరపు విజయకుమార్‌కు కేటాయించారు. దీంతో ప్రగడ తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు.

మన్యంలోనూ అంతే..

- అరకు అసెంబ్లీ స్థానాన్ని తొలుత కిడారి శ్రవణ్ కుమార్, సివేరి అబ్రహం ఆశించారు. అయితే వీరిద్దరిని కాదని చంద్రబాబు సియ్యారి దొన్నుదొరకు టికెట్ ప్రకటించారు. ఆయన జోరుగా ప్రచారం చేసుకుంటున్న తరుణంలో షాకిచ్చారు. ఆ సీటును బీజేపీ నేత పాంగి రాజారావుకు కేటాయించారు. అధినేత కొట్టిన దెబ్బకు దొన్నుదొర లబోదిబోమంటున్నారు.
- పాడేరు సీటును మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని కాదని నిన్న గాక మొన్ననే పార్టీ తీర్థం పుచ్చుకున్న రమేష్‌నాయుడుకు ఇచ్చారు. దీంతో గిడ్డి ఈశ్వరి ఇప్పుడు కుయ్యో మొర్రో అంటున్నా వినే వారే లేకుండాపోయారు. ఈ టికెట్‌ను ఆశించిన మత్స్యరాస మణికుమారి, ఎం.వి.వి.ప్రసాద్‌కు హ్యాండ్ ఇచ్చారు.
- రంపచోడవరంలో ఐదేళ్లుగా టీడీపీలో అన్నీ తానై వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరిని పక్కనబెట్టి ఇటీవలే పార్టీలో చేరిన శిరీషకు టికెట్ ఇచ్చారు. తమ నాయకుడు చంద్రబాబు ఇచ్చిన షాక్ నుంచి ఆమె ఇంకా తేరుకోలేదు.
- విశాఖ ఎంపీ టికెట్‌ను బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు ఆశించారు. ఆయన మూడేళ్లుగా విశాఖలోనే ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. సీటు తనదేనన్న ధీమాతో ఉన్న తరుణంలో ఆయనను పక్కనబెట్టి టీడీపీకి చెందిన ఎం. శ్రీభరత్‌కు ఇచ్చారు.
- అనకాపల్లి ఎంపీ సీటును ఆశించిన సీనియర్లకు చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. చింతకాయల విజయ్, దిలీప్ చక్రవర్తి పార్టీ టికెట్‌ను ఆశించారు. వీరిని పక్కనబెట్టి ధన బలం ఉన్న కడప జిల్లాకు చెందిన సీఎం రమేష్‌కు ఇవ్వడంతో వారు కంగుతిన్నారు.

కోడ్ ఉల్లంఘించారు.. సంజాయిషీ ఇవ్వండి

- సీఎం రమేష్, అయ్యన్నలకు ఈసీ నోటీసులు



నర్సీపట్నం: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారని పేర్కొంటూ బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు, టీడీపీ నర్సీపట్నం అభ్యర్థి సీహెచ్ అయ్యన్నపాత్రుడికి ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఈనెల 6న నర్సీపట్నం కృష్ణాప్యాలెస్‌లో బీజేపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌తోపాటు అయ్యన్నపాత్రుడు హాజరయ్యారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మహిళా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సీఎం రమేష్ చీరతోపాటు రూ.2 వేలు చొప్పున నగదు పంపిణీ చేశారు. చీరలు, నగదు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదుపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేసేందుకు వెళ్లగా సీఐ కాంతికుమార్, పోలీసులతో రమేష్ వాగ్వాదానికి దిగారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, వారిపై చిందులేశారు. చీరలు పంచితే తప్పేమిటని దబాయించారు. కోడ్ ఉల్లంఘించినందున సంజాయిషీ ఇవ్వాలని నర్సీపట్నం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం సీఎం రమేష్ వాట్సప్‌కు నోటీసు పంపించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు సాక్షాత్తు చీఫ్ సెక్రటరీ, డీజీపీలపై పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్న కనీస పరిజ్ఞానం కూడా లేకుండా ఎప్పటి మాదిరి అధికారులపై తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. దీంతో ఆయనకు కూడా ఆర్వో జయరాం నోటీసులు జారీ చేశారు.

మార్కెట్ సెస్ వసూళ్లు రూ.7.45 కోట్లు

- ప్రభుత్వ లక్ష్యం రూ.10.20 కోట్లు
- జీడి, బెల్లం దిగుబడి లేక తగ్గిన వసూలు



బలిఘట్టం వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు

నర్సీపట్నం: గడిచిన ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి సెస్ వసూళ్లు రూ.7.45 కోట్లు వచ్చింది. ప్రధానంగా జిల్లాలో బెల్లం, జీడి ఉత్పత్తులు భారీగా తగ్గిపోయాయి. ఈ ప్రభావం సెస్ వసూళ్లపై పడింది. దాంతో ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. రూ.10.20 కోట్ల లక్ష్యం విధించగా, కమిటీ అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొబైల్ టీంలతో పై మొత్తం సాధించగలిగారు. జిల్లాలో పాయకరావుపేట, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, యలమంచిలిలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఆయా మార్కెట్ యార్డుల ద్వారా ప్రభుత్వానికి ఏటా కోట్లలో ఆదాయం సమకూరుతోంది. రైతులు పండించిన పంట ఉత్పత్తుల నుంచి సెస్సు వసూలు చేయాలి. ఆ నిధులను రైతుల ప్రగతికి వినియోగించేలా ప్రభుత్వం నిర్దేశించింది. మార్కెట్ యార్డుల పరిధిలో ప్రధానంగా జీడిగింజలు, ధాన్యం, బెల్లం, అపరాలు, పసుపు, సరుగుడుతోపాటు ఇతర పంట ఉత్పత్తుల నుంచి సెస్సు వసూలు చేసేందుకు అధికారులు ఏటా కొంతమేర లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. దీనిలో భాగంగా ఈ ఏడాది రూ.10.20 కోట్ల వసూలు చేసేందుకు లక్ష్యంగా చేసుకున్నారు.

ప్రత్యేకంగా మొబైల్ టీంలతో వసూలు....

గతంలో ఎన్నడూ లేనంతగా లక్ష్యాన్ని నిర్దేశించడంతో దాన్ని చేరుకునేందుకు స్థానిక అధికారులు ఆరు మార్కెట్ యార్డుల పరిధిలో తొమ్మిది చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు చెక్‌పోస్టుల సమీప ప్రాంతాల్లో పంట ఉత్పత్తులకు మాత్రమే సెస్సు చెల్లించేవారు. వీటికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులకు ఎటువంటి సెస్సు చెల్లించకుండా తరలించుకుపోయేవారు. ఈ విషయాన్ని గమనించిన మార్కెట్ కమిటీ అధికారులు ఈ ఏడాది గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా మొబైల్ టీంలను ఏర్పాటు చేసి వసూళ్లకు శ్రీకారం చుట్టారు. అధికారులు తీసుకున్న చర్యలతో వ్యవసాయ మార్కెట్‌కు రూ.7.45 కోట్లు ఆదాయం సమకూరింది.

లక్ష్యానికి చేరువలోకి వచ్చాం...



జీడి పంట దెబ్బతినటం, బెల్లం ఉత్పత్తి తగ్గడం వల్ల ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. రూ.10.20 కోట్లు టార్గెట్ కాగా, సెక్రటరీలు, సిబ్బంది కృషి ఫలితంగా రూ.7.45 కోట్లు వసూలైంది. యలమంచిలి, నర్సీపట్నం, మాడుగుల యార్డుల పరిధిలో సెస్సు వసూళ్లు బాగున్నాయి.

– బి.రవికిరణ్, ఏడీ, మార్కెటింగ్

స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి



డాబాగార్డెన్స్: క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మ వారు స్వర్ణాభరణాలు, పట్టుచీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా గణపతి పూజ, మండపారాధన నిర్వహించిన అనంతరం ఎస్వీఎస్ఆర్‌కే ప్రసాద్ పంచాంగం చదివి వినిపించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి, పంచాంగ పుస్తకాలు వితరణ చేశారు. ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.ఎస్.తిరుమలేశ్వరరావు, వి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అప్పన్న పెళ్లి రాట ఉత్సవం



అప్పన్న ఉత్సవమూర్తులు

- దేవస్థానంలో పంచాంగ శ్రవణం
- స్వామి మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు
- పరవశించిన భక్త జనులు



నృసింహ మండపంలో పెళ్లిరాట వేస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి,అర్చకులు

సింహాచలం: ఉగాది పర్వదిన వేళ సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి పెళ్లి రాట మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ నెల 19న జరిపించనున్న వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని పెళ్లిరాట ఉత్సవాన్ని అశేష భక్తజనుల మధ్య మంగళవారం సాయంత్రం సింహాచల దేవస్థానం వైదిక, అధికార వర్గాలు ఘనంగా జరిపించాయి.

పెళ్లికొడుకైన అప్పన్న

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పెళ్లి కుమారుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సహా ఆలయ ఆస్థానమండపంలో కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. తొలుత దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పంచాంగ పఠనం చేశారు. తదుపరి మహిళలు, ముత్తయిదువలు పసుపుకుంకుమలతో పెళ్లిరాటలను అలంకరించారు. అనంతరం నాదస్వర వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల జేజేల మధ్య ఆలయ ఉత్తరద్వారం వద్ద, రాజగోపురం వద్ద, వార్షిక కల్యాణోత్సవం జరిగే నృసింహ మండపంలో శాస్త్రోక్తంగా పెళ్లిరాటలను వేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు.

దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు గిరి, రాజీవ్, వేదపండితులు, పారాయణదారులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగే స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల ఆహ్వాన పత్రికలను, శ్రీ క్రోధినామ సంవత్సర పంచాంగాలను దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆవిష్కరించారు. ఈ నెల 19న రాత్రి స్వామి వారి రథోత్సవం, వార్షిక కల్యాణోత్సవం జరగనున్నాయి.



రాజగోపురం నుంచి పడుతున్న సూర్యకిరణాలు

ఆలయంలో అద్భుత దృశ్యం

ఉగాది వేళ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్‌పై పడిన సూర్యకిరణాలను చూసి భక్తులు పరవశించారు. ఈ అద్భుత దృశ్యం సాయంత్రం ఆలయంలో చోటుచేసుకుంది. ఏటా ఉగాది రోజు సాయంత్రం స్వామివారి మూలవిరాట్‌పై సూర్యకిరణాలు పడటం పరిపాటి. అయితే మూడేళ్ల నుంచి వర్షం, మబ్బుల కారణంగా సూర్య కిరణాలు స్వామిపై పడకపోవడంతో ఆ అవకాశం కలగలేదు.

ఈ సారి మాత్రం మంగళవారం సాయంత్రం 5.40 గంటల సమయంలో ఆలయ రాజగోపురం నుంచి ఆస్థాన మండపం, భోగమండపం మీదుగా సూర్యకిరణాలు ప్రసరించి అంతరాలయంలో ఉన్న స్వామివారి మూలవిరాట్‌పై పడటంతో ఈ అపురూప దృశ్యాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఈ దృశ్యాన్ని భక్తులు తిలకించేలా ఈవో శ్రీనివాసమూర్తి ఏర్పాట్లు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఇష్టపడి చదివితే ఉన్నత భవిత



విజేతలకు జ్ఞాపికలను అందిస్తున్న ఆడారి రవికుమార్

అనకాపల్లి: కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదవడంతో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని జిల్లా విద్యాశాఖ ఏడీఆర్ ఆడారి రవికుమార్ అన్నారు. మండలంలోని తుమ్మపాల గౌరీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఈ నెల 3న సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉగాది సందర్భంగా బహుమతులు అందించారు. మండలంలోని పి.దేదీప్యకు ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ఎస్.హర్షవర్ధన్‌కు ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, ఆర్.జాహ్నవికి తృతీయ బహుమతిగా రూ.2 వేలు నగదుతో పాటు, జ్ఞాపికలను అందించారు. మరో 10 మందికి ప్రోత్సాహక బహుమతులుగా రూ.వెయ్యి నగదు, జ్ఞాపికలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఆడారి నారాయణమూర్తి, గౌరవ అధ్యక్షులు రాపేటి నాగేశ్వరరావు, ఆళ్ల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం శివారులో కోడి పందాలు ఆడుతుండగా దాడి చేసి ముగ్గురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా రెండు పందెం కోళ్లు, రూ.750 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కన్నూరుపాలెం శివారులో నగదు పణంగా పెట్టి పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

19 మద్యం బాటిళ్లు స్వాధీనం

యలమంచిలి రూరల్: మద్యం బాటిళ్లు తరలిస్తున్న కశింకోట మండలం నర్సింగబిల్లి గ్రామానికి చెందిన చిందాడ దొరబాబుపై కేసు నమోదు చేసినట్లుపట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. తనిఖీల్లో భాగంగా యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దొరబాబు నుంచి 19 మద్యం బాటిళ్లు స్వాధీనపరచుకున్నామన్నారు. అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యే చొరవతో మెయిన్ రోడ్డుకు మరమ్మతులు

- స్వయంగా పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే ధర్మశ్రీ



బీఎన్ రోడ్డు పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రజల రహదారి కష్టాలను అర్థం చేసుకున్న చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చొరవతో బీఎన్ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పనులు చేపట్టడమే తడవుగా హుటాహుటిన భారీ యంత్రాలతో రెండు కిలోమీటర్ల మేర రోడ్డును ఒక్కరోజులోనే నిర్మించారు. వాస్తవానికి బీఎన్ రోడ్డులో వెంకన్నపాలెం నుంచి వయా చోడవరం, వడ్డాది మీదుగా రోలుగుంట వరకూ రోడ్డు పునరుద్ధరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఏడాదిన్నర కిందట ఎన్‌డీబీ నిధులు రూ.120 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఉన్న రోడ్డును మరో 8 అడుగులకు అదనంగా విస్తరిస్తూ కొత్తగా రోడ్డును ఈ స్కీమ్‌లో వేయాల్సి ఉంది. ఈ రోడ్డు పనులకు ఎస్ఆర్‌సీ నిర్మాణ సంస్థ టెండరు ద్వారా దక్కించుకుంది. ఏడాది కిందట రోడ్డు పనులు ప్రారంభించి అరకొరగా చేసి, మధ్యలోనే కాంట్రాక్టర్ నిలిపేశారు. సదరు కాంట్రాక్టర్ టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ రోడ్డు పనులు మధ్యలో నిలిపేసినట్లు ఎమ్మెల్యే ధర్మశ్రీ పలుమార్లు ఆందోళనలు కూడా చేశారు. అయినా కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టలేదు. కాంట్రాక్టర్‌పై ప్రభుత్వానికి ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంతో రోడ్డు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ రాజకీయంగా లాబీయింగ్ చేసి ఈ రోడ్డు పనులు మాత్రం చేపట్టకుండానే వదిలేశారు. ఈ పరిస్థితిలో రోజురోజుకీ రోడ్డు మరింతగా దెబ్బతిని వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండటంతో ఎమ్మెల్యే ధర్మశ్రీ స్పందించారు. భారీ యంత్రాలను రంగంలోకి దింపి రోడ్డు పనులు ప్రారంభించారు. తాను దగ్గరుండీ పర్యవేక్షణ చేస్తూ ఒక్కరోజులోనే చోడవరం కాలేజీ జంక్షన్ నుంచి నర్సయ్యపేట వరకు రోడ్డు వేశారు.

మిగతా చోట్ల కూడా రోడ్డును పునరుద్ధరించి, ప్రజల రహదారి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఇన్నాళ్లూ భారీ గోతులతో ఉన్న రోడ్డు కొత్త రోడ్డుగా మారడంతో వాహన చోదకులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

‘ఇంగ్లిష్ స్పీకింగ్’లో ఉచిత శిక్షణ

‘మేధా ఇన్‌స్టిట్యూట్’ ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచి ఇంగ్లిష్ మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని ‘మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్’ వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లిష్ స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. ‘‘మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం’’ అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లిష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు.

‘‘ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేని పక్షంలో 98660 06662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం’’ అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

అర్చకులకు ఉగాది పురస్కారం



అర్చకులను సన్మానిస్తున్న దేవదాయ శాఖ జిల్లా అధికారి సుధారాణి

అనకాపల్లి: ఉగాది సందర్భంగా పలు దేవాలయాలలో ఎన్నాళ్ల నుంచో పనిచేస్తున్న అర్చకులను దేవదాయ శాఖ అధికారులు సన్మానించారు. స్థానిక దేవదాయ శాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లా అధికారి కె.ఎల్.సుధారాణి 12మంది అర్చకులను శాలువాతో సత్కరించి, సన్మాన పత్రం, రూ. 10,116ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయ అర్చకులను సన్మానించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. వీరి ఆశీర్వాదాలు ఈ సమాజానికి, దేశానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. నిత్యం దేవుని సన్నిధిలో ఉండే అర్చకుల జీవన విధానం ఎంతో ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో అర్చక సమాఖ్య ప్రతినిధులు పులకండం ప్రసాదు, పేరూరి భోగలింగం, పలు దేవాలయాల అర్చకులు, యలమంచిలి జోన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, అనకాపల్లి జోన్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఈవో కె.ఆదినారాయణ పాల్గొన్నారు.

సన్మానం పొందిన వారు: కోంటి వెంకట రామాచార్యులు (వి.మాడుగల మండలం కస్పా జగన్నాధపురం రామాలయం), ఆరవెల్లి సత్యనారాయణాచార్యులు (యలమంచిలి మండలం పులపర్తి గ్రామం వేణుగోపాలస్వామి దేవాలయం), పొనంగపల్లి నరసింహాచార్యులు (యలమంచిలి మండలం తేరువపల్లి గ్రామం కేశవస్వామి దేవాలయం), దొంతుకుర్తి శంకరరావు (కశింకోట మండలం వెదురుపర్తి గ్రామం రామలింగేశ్వరస్వామి దేవాలయం), పేరూరు చిన్నభీమేశ్వరరావు (అనకాపల్లి శ్రీ సర్వకాంబ సమేత భోగలింగేశ్వర దేవాలయం), రాంపల్లి గౌరీ విశ్వేశ్వర నాగరాజు (చోడవరం మండలం గవరవరం కాశీవిశ్వేశ్వర దేవాలయం), గోపాద అన్నం చక్రధర ఆచార్యులు (మాడుగుల మండలం వీరవల్లి రామాలయం), దొడ్డిపట్ల శేషాచార్యులు (నర్సీపట్నం దుర్గామల్లేశ్వర దేవాలయం), బంధకవి వెంకట్రావు (మాకవరపాలెం రాచపల్లి గ్రామం కామేశ్వరమ్మ దేవాలయం), భద్రాద్రి రాముడు (గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామం రాధాకృష్ణ స్వామి దేవాలయం).

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బాల త్రిపురసుందరిగా..



కలశస్థాపన చేసిన ఆహూతులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గోపూజతో ప్రారంభమైన ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆహుతులైన భక్తుల సమక్షంలో శ్రీమేరు మొదటి అంతస్తులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక మీద కలశ స్థాపన చేశారు. అనంతరం ఉత్సవమూర్తి లలితాంబిక అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించి నూతన వస్త్ర, ఆభరణ అలంకరణ గావించారు.లలితా సహస్రనామ పారాయణ,త్రిశతి,బాలా సహిత లలితా హోమం జరిపించారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనను గురుమాత అన్నపూర్ణమ్మ ప్రారంభించారు.

మోదమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లి ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను మంగళవారం ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహచలంనాయుడు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము ఆవిష్కరించారు. ముందుగా అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు చేశారు. వచ్చేనెల 19, 20, 21తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయని వారు తెలిపారు. ఐటీడీఏ పీవో అభిషేక్, సినీనటులు ప్రచాన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం,ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు,యాదగిరి శ్రీను,వెంకటరమణ,ఇతర ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు, వర్తక సంఘం నేతలు పాల్గొన్నారు.

ఘనంగా పేరంటాలమ్మ తీర్థం



పేరంటాలమ్మ తీర్థానికి హాజరైన ప్రజలు



అమ్మకానికి ఉంచిన దేవుని బొమ్మలు

పాయకరావుపేట: పట్టణంలోని పేరంటాలమ్మ తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. మంగవరం రోడ్డులోని పేరంటాలమ్మ గుడికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, పసుపు కుంకుమ, పండ్లు, పూలు సమర్పించారు. పక్కనే ఉన్న సీతారామ దేవస్థానాన్ని కూడా దర్శించుకున్నారు. పేరంటాలమ్మ గుడికి హాజరైన భక్తులకు పట్టణానికి చెందిన మలిపెద్ది కుటుంబీకులు సౌకర్యాలు కల్పించారు. సీతారామ దేవస్థానం వద్ద ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వానరసేన సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పేరంటాలమ్మ తీర్థంను చిలకల తీర్థం, చేటల తీర్థం అని కూడా పిలుస్తారు. ఇక్కడ వివిధ రంగుల్లో తయారు చేసే పంచదార చిలకలు, చేటలు ప్రసిద్ధి. బెల్లం మిఠాయిలు, పిల్లలు ఆడుకునే ప్లాస్టిక్ బొమ్మలు, చిన్న చిన్న దేవుని విగ్రహాల అమ్మకాలు ఎక్కువగా జరిగాయి. ఈ తీర్థానికి పాయకరావుపేట, తుని, నక్కపల్లి, కోటనందూరు తదితర మండలాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ తీర్థానికి వచ్చే జనాలతో ఈ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తీర్థానికి హాజరయ్యే వారికి పలువురు దాతలు, స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, తాగునీరు ఏర్పాట్లు చేశారు.

నృసింహుడికి విశేష పూజలు

- శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
- వైభవంగా గరుడసేవ



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఉగాది పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 1001నామాలను పఠిస్తూ స్వామికి అర్చన చేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అర్చకుడు కుమారాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విభిన్న కథాంశంతో ‘లవ్‌మౌళి’



హీరోయిన్‌లతో హీరో నవదీప్

సీతమ్మధార: ×లవ్ మౌళి×చిత్రం హీరోగా నాకు మంచి బ్రేక్ ఇస్తుందని నటుడు నవదీప్ అన్నారు. ఆయన హీరోగా పంఖురి గిద్వానీ హీరోయిన్‌గా నటించిన చిత్రం లవ్ మౌళి. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం శరత్ థియేటర్‌లో సినిమా ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ తాను విశాఖ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ ఎన్నో చిత్రాల షూటింగ్‌లో పాల్గొన్నానని గుర్తు చేశారు. ఈ చిత్రంలో నటించిన భావన విశాఖ అమ్మాయే అని చెప్పారు. తాను ఎంతో ఇష్టంతో చేసిన సినిమా ఇదని, మేఘాలయలో 70 రోజుల పాటు కష్టపడి షూటింగ్ చేశామన్నారు. విభిన్న కథాంశంతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ నెల 19న విడుదల అవుతుందన్నారు. న్యూసెన్స్–2 త్వరలోనే సెట్స్ పైకి వెళ్తుందన్నారు. హీరోయిన్ మాట్లాడుతూ ఈ సినిమా అందరికీ నచ్చుతుందన్నారు.

ఉచిత హిందీ శిక్షణ తరగతులు ప్రారంభం

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబరులో జరగనున్న హిందీ లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులను ఆదర్శహిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఉచిత శిక్షణ తరగతులు భీమిలిలో నిర్వహిస్తామన్నారు. జాతీయ భాష హిందీని పలువురు నేర్చుకోవడం, మరికొందరికి సిఫారసు చేయడం ద్వారా జాతీయ సమైక్యతకు దోహదపడాలని కోరారు. వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

యూకలిప్టస్, సరుగుడు తోటలు దగ్ధం



తైపురంలో కాలిపోయిన సరుగుడు తోట



చెట్టుపల్లిలో కాలిన యూకలిప్టస్ తోట

- రెండు వేర్వేరు ప్రమాదాల్లో రూ.24 లక్షల ఆస్తి నష్టం

బుచ్చెయ్యపేట/చీడికాడ: బుచ్చెయ్యపేట మండలం తైపురం, చీడికాడ మండలం చెట్టుపల్లిలో జరిగిన అగ్నిప్రమాదాల్లో యూకలిప్టస్(నీలగిరి), సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. ఈ రెండు ప్రమాదాల్లో రూ.24 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాలు. తైపురంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 10 ఎకరాల్లో సరుగుడు, యూకలిప్టస్ తోటలు దగ్ధమై, సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగింది. మంగళవారం మధ్యాహ్నం పప్పలబంద చెరువు వద్ద దారినపోయే గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిపారేసిన సిగరెట్టు వల్ల ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చని రైతులు చెప్తున్నారు. గ్రామానికి చెందిన సీతా రామేశ్వరరావు తోట నుంచి మంటలు వ్యాపించాయి. వాటిని ఆర్పేందుకు ప్రయత్నించగా గాలికి మరింతగా రాజుకున్నాయి. దీంతో సీతా రామేశ్వరరావు, ఎర్రినాయుడు, బోయిపు రాజు, డేగల రమణ, మారాజు అచ్చింనాయుడు, నూకరత్నం, ముచ్చకర్ల సత్యవతి, ఉల్లంగుల అప్పారావులకు చెందిన మూడున్నరేళ్ల క్రితం నాటిన 8 ఎకరాల్లోని సరుగుడు, 2 ఎకరాల యూకలిప్టస్ తోటలు కాలిపోయాయి. గ్రామానికి దూరంగా పొలాలు ఉండటంతో ఫైరింజన్ వచ్చే అవకాశం లేక గ్రామ యువకులు, రైతులు మంటలను అదుపు చేశారు. సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను సంఘటనా స్థలాన్ని పరిశీలించి రైతులను ఆదుకోవాలని తహసీల్దార్ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు.

- చీడికాడ మండలంలోని చెట్టుపల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం అంటిన కార్చిచ్చులో సుమారు 6 ఎకరాల్లో యూకలిప్టస్ తోటలు, ఒక గడ్డివాము దగ్ధం అయ్యాయి. సుమారు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. అర్జునగిరి గ్రామం కసిరెడ్డి అప్పలనాయుడు కుమారులకు చెందిన 4 ఎకరాలు, చెట్టుపల్లి గ్రామం ముమ్మిర గణేష్, శశి, అప్పలనర్సమ్మకు చెందిన 2 ఎకరాల్లోని తోటలు దగ్ధమైనట్లు మాజీ సర్పంచ్ పాతాళం చిన్నంనాయుడు తెలిపారు.

ఈ తోటలకు దాదాపు 400 మీటర్ల దూరంలో ఉన్న పాతాళం ఎర్రిబాబుకు చెందిన గడ్డివాముపై అగ్ని కణాలు పడడంతో అదికూడా దగ్ధమైంది.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మూడిళ్లు దగ్ధం

- రెండు వేర్వేరు ప్రమాదాల్లో రూ.13.5 లక్షల ఆస్తి నష్టం
- బాధితులను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



చీడికాడ దండిసురవరంలో బాధితులతో మాట్లాడుతున్న అనురాధ



దేవరాపల్లిలో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ

చీడికాడ/దేవరాపల్లి: చీడికాడ మండలం దండిసురవరం, దేవరాపల్లి మండల కేంద్రంలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదాల్లో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. రూ.13.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాలు. దండిసురవరం గ్రామానికి చెందిన గండిన వెంకటసూరిఅప్పారావు ఇంటి వద్ద తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న బత్తిన గంగరాజు ఇంటికీ మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రెండు ఇళ్లలోని వంటసామాగ్రి, దుస్తులు, తిండి గింజలు కాలిబూడిదయ్యాయి. బాధితుడు వెంకట సూరిఅప్పారావు మాట్లాడుతూ తన ఇంట్లో రూ 2.70 లక్షల నగదు, 6 తులాల బంగారు ఆభరణాలు, గంగరాజు ఇంట్లో రూ.70 వేల నగదు మంటల్లో కాలిపోయినట్లు తెలిపారు. దీంతోపాటు రెండు బస్తాల మినుములు, తమ పిల్లలకు చెందిన రెండు ట్యాబ్‌లు బూడిదయ్యాయన్నారు.

దేవరాపల్లిలో ఏలూరు ప్రాంతానికి చెందిన జల్లూరు శేషారావు పూరింట్లో మంటలు చెలరేగాయి. వీరు స్థానికంగా చేపల చెరువులు నిర్వహిస్తుంటారు. కుటుంబమంతా చేపల చెరువు వద్దకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లో దాచి ఉంచిన రూ. 25 వేలు నగదుతో పాటు టీవీ, ఫ్రిజ్ తదితర గృహోపకరణాలు కాలిబూడిదవడంతో బాధిత కుటుంబానికి సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. మంటల వేడికి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో సమీపంలో ఉన్న సోలార్ ప్యానల్స్ ధ్వంసమయ్యాయి. గుల్లేపల్లి మురళీకృష్ణకు చెందిన 10 ప్యానల్స్, గుల్లిపల్లి సన్యాసినాయుడుకు చెందిన నాలుగు ప్యానల్స్ దెబ్బతిన్నాయి. ఒక్కో ప్యానల్ ఖరీదు రూ.25 వేలని, మొత్తం రూ.3.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. స్థానిక వీఆర్‌వో నాగేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విషయం తెలిసిన వెంటనే మాడుగుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈర్లె అనురాధ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులకు అండగా నిలుస్తానని, జరిగిన నష్టాన్ని అధికారులు దృష్టికి తీసికెళ్లి అదుకునేలా చూస్తానని అనురాధ తెలిపారు. ఆమె వెంట సర్పంచ్ కోన అర్జున, ఎంపీపీ కురచా జయమ్మ, నారాయణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, నాయకులు ఈర్లె చైతన్య, నందారపు రమణబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, నాయకులు గండిపడాల అప్పలరాజు, గుల్లిపల్లి మురళీకృష్ణ, కొరుపోలు శ్రీను తదితరులున్నారు.

ఆస్పత్రిలో పింఛను అందజేత



ఆస్పత్రిలో తిరుపతమ్మకు పింఛను అందిస్తున్న వెంకటేష్

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లికి చెందిన దివ్యాంగురాలు తిరుపతమ్మకు మంగళవారం సచివాలయ సిబ్బంది ఆస్పత్రికి వెళ్లి ఈ నెల పింఛన్ నగదు అందించారు. వివరాల్లోకి వెళ్తే.. తిరుపతమ్మ గర్భిణీ. ప్రసవం కోసం కొద్ది రోజుల క్రితం అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో చేరింది. పింఛను తీసుకునేందుకు నక్కపల్లి వచ్చే అవకాశం లేకపోవడంతో విషయం తెలుసుకున్న సచివాలయ కార్యదర్శి రాజశేఖర్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించే ఏర్పాట్లు చేశారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్‌ను అనకాపల్లిలోని ఆస్పత్రికి పంపించి తిరుపతమ్మకు పింఛన్ అందించారు. పింఛను అందించే సమయంలో తిరుపతమ్మ మగబిడ్డకు జన్మనిచ్చిందని సచివాలయ సిబ్బంది తెలిపారు. కార్యదర్శి రాజశేఖర్, సిబ్బంది వెంకటేష్‌లను ఎంపీడీవో శ్రీనివాసరావు అభినందించారు.

క్లుప్తంగా

చిరస్మరణీయుడు చంద్ర రాజేశ్వరరావు



చంద్ర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ అగ్రనేత చంద్ర రాజేశ్వర రావు 30వ వర్ధంతి సందర్భంగా రాజేశ్వరరావు చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజాన దొరబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ మతోన్మాద విధానాలు భారతదేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. అన్ని మతాలను, కులాలను సమదృష్టితో చూడడమే ప్రజాస్వామ్యానికి ప్రయోజనకరమని సూచించారు. ఉన్నత కుటుంబంలో జన్మించిన రాజేశ్వరరావు తన భూములను పేదలకు పంచిపెట్టిన చిరస్మరణీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నేతలు నరాలశెట్టి సత్యనారాయణ, సాయిలక్ష్మణ్, కోరిబిల్లి శంకర్‌రావు, సతీష్, కోన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణ రాట

కశింకోట: స్థానిక కస్పావీధి రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలకు మంగళవారం అంకురార్పణ చేశారు. ఈ నెల 17న శ్రీరామ నవమి పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవాన్ని భారీగా నిర్వహించనున్నారు. ఈమేరకు వేద మంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవ రాటగా నేరేడు చెట్టు కొమ్మను తెచ్చి దానికి పసుపు రాసి బొట్లు పెట్టి నిలిపారు. కార్యక్రమంలో ఉత్సవ ప్రతినిధులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, శిష్టి అప్పారావు, నడిపల్లి సన్యాసిరావు, ఎంఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చింతపాలెంలో ఇఫ్తార్ విందు

కశింకోట: మండలంలోని చింతలపాలెం సయ్యద్ జాఫర్ షా మసీదులో మంగళవారం రాత్రి రంజాన్ మాసంలో భాగంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. విమల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లి. డైరెక్టర్ షేక్ సలీం ఆధ్వర్యంలో విందు కార్యక్రమం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్ష చేసి, అనంతరం ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ బాబ్జీ, కార్యదర్శి మహ్మద్ రబ్బానీ, ఇమాం మహ్మద్ గౌస్, సభ్యులు షేక్ దర్గా, షేక్ అలీ, షేక్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శని వారం 5,483 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,230
మొదటి రకం	3,580	4,160
రెండో రకం	3,430	3,830
మూడోరకం	3,280	3,460

అనకాపల్లి సినిమాలు

భరతనాట్యం	: రాజా
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	: సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్	: సత్యనారాయణస్క్రీన్-2
ఫ్యామిలీ స్టార్	: షిర్డిసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
మంజుమ్మెల్ బాయ్స్	: వెంకటేశ్వర
ప్రేమలు	: శ్రీసత్య
టిల్లు స్క్వేర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-14 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 298 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 195 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఊరు మారింది

శరవేగంగా శంకరం అభివృద్ధి

శంకరం గ్రామం.. ఐదేళ్ల క్రితం వరకు బౌద్ధక్షేత్రం బొజ్జన్నకొండ నెలవుగానే ఎక్కువ మందికి తెలుసు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతన జిల్లాగా అనకాపల్లి ఏర్పాటుతో శంకరం గ్రామ ప్రాధాన్యత ఒక్కసారిగా పెరిగింది. కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్ తదితర ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల్లో చాలా వరకు ఇక్కడే ఏర్పడ్డాయి. దీంతో సీఎం జగన్ పాలనలో ఈ గ్రామ అభివృద్ధికి నిధులు వెల్లువెత్తాయి. అంతకు మించిన స్థాయిలో సంక్షేమ లబ్ధిని అందుకున్న ప్రజలు, ప్రభుత్వ పాలనపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



తుది దశ నిర్మాణ పనుల్లో అంగన్‌వాడీ భవనం

- రూ.33.5 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి
- ప్రతి ఇంటికీ అందిన సంక్షేమ ఫలాలు
- జగనన్న కాలనీతో కొత్తగా ఓ ఊరే ఏర్పాటు

తుమ్మపాల: గత ప్రభుత్వ పాలనలో శంకరం గ్రామం పూర్తి పల్లె వాతావరణంలో ఉండేది. ప్రస్తుత ప్రభుత్వంలో గ్రామ రూపురేఖలే మారిపోయాయి. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, అంగన్‌వాడీ కేంద్రం, నాడు-నేడులో స్కూల్ అభివృద్ధి, సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుతో గ్రామంలో ఎటు చూసినా అభివృద్ధి కళ్లముందు సాక్షాత్కరిస్తుంది. దాదాపు రూ.4.5 కోట్ల నిధులతో గ్రామానికి అవసరమైన అన్ని మౌలిక వసతుల్ని ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

జిల్లా అభివృద్ధి కేంద్రం శంకరం

అనకాపల్లి కొత్త జిల్లాగా ఏర్పడ్డాక శంకరం గ్రామానికి ప్రాధాన్యత పెరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలన్నీ దీని చుట్టుపక్కలే ఏర్పాటయ్యాయి. శాశ్వత కలెక్టరేట్, నిర్మాణానికి ఇప్పటికే 25 ఎకరాల భూమిని ఇక్కడ సేకరించి, ప్రభుత్వానికి నివేదికలు పంపారు. జిల్లా పర్యాటకానికి మణిహారమైన పురాతన బౌద్ధ క్షేత్రం కూడా శంకరంలోనే ఉంది. దీని అభివృద్ధికి ప్రభుత్వం రూ.7.5 కోట్ల నిధులు వెచ్చించింది. పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

జగనన్న కాలనీతో కొత్తగా ఊరు

గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు సొంతింటి కలను ఈ ప్రభుత్వం సాకారం చేసింది. సుమారు 200 ఇళ్లతో ఉండే ఈ గ్రామంలో గతంలో వెయ్యి గృహాలతో బహుళ అంతస్తుల్లో ఇందిరమ్మ గృహ సముదాయం ఏర్పడింది. ఇపుడు జగనన్న కాలనీలో 120 వ్యక్తిగత నివాసాలతో కొత్త ఊరే తరలి వచ్చింది. దీంతో శంకరం గ్రామం పూర్తిగా అనకాపల్లి పట్టణంలో కలిసిపోయి నట్టుంది.



నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేసిన పాఠశాల



జాతీయ రహదారి నుంచి వినాయక గుడి వరకు కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు



తుది దశలో సచివాలయ భవనం

శంకరంలో ప్రధాన అభివృద్ధి

	రూ.లక్షల్లో
సచివాలయ భవనం	23
రైతు భరోసా కేంద్రం	20
వెల్‌నెస్ కేంద్రం	18
నాడు-నేడులో స్కూల్ అభివృద్ధి	12
సీసీ రోడ్ల నిర్మాణం	40
సీసీ డ్రైనేజీల నిర్మాణం	34
అంగన్‌వాడీ భవనం	10
కలెక్టరేట్ రహదారి విస్తరణ	11

వీటితోపాటు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, హైవే నుంచి రోడ్ల అనుసంధానం, ఇంటింటి కుళాయిలు, ఇందిరమ్మ గృహ సముదాయంలో వసతుల కల్పన తదితర అభివృద్ధి పనులు చేపట్టారు.

సంక్షేమ పథకాల లబ్ధి	రూ. కోట్లలో
ఐదేళ్లలో సంక్షేమ లబ్ధి	21.47
డీబీటీ ద్వారా లబ్ధి	16.03
నాన్ డీబీటీ లబ్ధి	5.45

సొంతింటి కల సాకారం



సొంతిల్లు లేక అద్దె ఇంట్లో పిల్లలతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక మాకు ఇల్లు లేని విషయం గుర్తించి జగనన్న లేఅవుట్‌లో నాపేరున స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందించారు. డ్వాక్రా ద్వారా రూ.30 వేలు వడ్డీ లేని రుణం ఇచ్చారు. దీంతో శరవేగంగా ఇంటి నిర్మాణ పనులు పూర్తిచేసుకుని ఆ ఇంటిలోనే ప్రస్తుతం నివాసం ఉంటున్నాం. నా బిడ్డకు అమ్మ ఒడి వస్తోంది. నా భర్తకు వాహన మిత్ర ద్వారా ఏడాదికి రూ.10 వేలు అందింది. మా ఊర్లో అర్హులైన వారందరికీ అన్ని సంక్షేమ పథకాలూ అందుతున్నాయి. జగనన్నే మళ్లీ సీఎం కావాలి.

– కరణం పుష్పావతి, గృహిణి

అందుబాటులో అన్ని సేవలు



గతంలో కన్నా మా ఊరు ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు, మరో పక్క బొజ్జన్నకొండ అభివృద్ధితో ఊరు అనకాపల్లి పట్టణంలో దాదాపుగా కలిసిపోతోంది. గ్రామంలో భూముల ధరలు కూడా బాగా పెరిగాయి. గ్రామానికి పట్టణానికి రాకపోకలకు మెరుగైన సౌకర్యాలు ఏర్పడ్డాయి. గతంలో ఏ అవసరం ఉన్నా అనకాపల్లి పట్టణానికి పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామస్తులకు అవసరమైన ప్రతి సేవా ఊరిలోనే అందుతోంది. రైతుల అవసరాలన్నీ ఆర్బీకేల ద్వారా తీరుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీలు కొత్తగా నిర్మించారు. స్కూల్, ఆస్పత్రి అభివృద్ధి చేశారు. సీఎం జగన్ ప్రభుత్వ పనితీరు బాగుంది.

– తోట భూషణరావు, శంకరం గ్రామం

త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

అనకాపల్లి: తెలుగు ప్రజలకు ఉగాది నుంచి కొత్త సంవత్సరం మొదలవుతుందని ఈ ఏడాదంతా ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని డీఎస్పీ ఎస్.అప్పలరాజు అభిలషించారు. తమ కార్యాలయంలో క్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన తెలుగు కాలసూచనలో భగవద్గీత వచనాలను జోడించి సరళమైన భాషలో క్యాలెండర్ రూపొందించారని పేర్కొన్నారు. తెలుగు నెలలను అనుసరించేందుకు వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, హిందూ జ్ఞానవేదిక విశాఖ ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసు, సభ్యులు మంగ, లక్ష్మి, మహక్క, దేవి, నాగమణి, శ్రియ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ అప్పలరాజు

స్వర్ణ పుష్పాలంకరణలో ధ్యాన వేంకటేశుడు




108 స్వర్ణ పుష్పాల అలంకరణలో ధ్యాన వేంకటేశుడు

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామికి 108 స్వర్ణ పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. ఉగాది పురస్కరించుకుని మంగళవారం బంగారు పూలను స్వామి పాదాల వద్ద వరుసగా పేర్చారు. మూలవిరాట్‌ను పూలమాలలతో అలంకరించారు. అష్ట దళ పాద పద్మారాధన చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా నూకాంబిక ఉత్సవాలు

కశింకోట: స్థానిక స్వయంభూ నూకాంబిక ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య ఉత్సవాల్లో భాగంగా ఆలయ ధర్మకర్త వేగి శివగణేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు. భక్తులు తల నీలాలు, చీరలు, రవికెలు, అరటి గెలల రూపంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో గంప జాతరలు జరిపి, కుటుంబ సభ్యులు ఆనందంగా గడిపారు. వరుసగా మూడో రోజు కూడా మహిళల భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

- నరసింగబిల్లిలో నూకాంబిక ఉత్సవాల్లో భాగంగా పోతురాజుబాబు జాతర నిర్వహించారు. పలువురు నేల వేషాలతో వీధుల్లో సందడి చేశారు. అనంతరం వారంతా ఓ చోట చేరి నరసింగబిల్లి, చింతలపాలెం గ్రామాల్లో జాతర ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కశింకోటలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో భక్తుల పూజలు

- నూతలగుంటపాలెం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, గొబ్బూరు, కన్నూరుపాలెం తదితర గ్రామాల్లోని నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో కూడా విశేష పూజలు జరిగాయి.

ఘాటీరత్నం పేరంటాలమ్మ సన్నిధిలో మలసాల

అనకాపల్లి: మండలంలోని బట్లపూడి పంచాయతీ నాయుడుపేటలో ఘాటీరత్నం పేరంటాలమ్మ వారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారి ఆలయానికి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం అమ్మవారి తీర్థ మహోత్సవంలో రంగులరాట్నం, ఆకాశచక్రం వద్ద చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా ఉత్సాహంగా గడిపారు. తినుబండారాలు, గృహోపకరణాలు తీర్థప్రియులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



ఘాటీరత్నం పేరంటాలమ్మను దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

చలివేంద్రం ప్రారంభం

అనకాపల్లి: వేసవి కాలంలో చలివేంద్రాలు పాదచారులకు, వాహనదారులకు దాహార్తిని తీరుస్తాయని చింతామణి గణపతి దత్త క్షేత్ర వ్యవస్థాపకులు ఆంజనేయరాజు అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి దత్త క్షేత్రం జాతీయ రహదారిలో చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. దాతల సహాయంతో కొన్ని రోజులు మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో దత్త క్షేత్ర సభ్యులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఆంజనేయరాజు

భావనారుషి కల్యాణోత్సవాలు

రాంబిల్లి : కొత్తపేట గ్రామంలో భద్రావతి సమేత భావనారుషీశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

దుర్గమాంబను దర్శించుకున్న బుల్లిబాబు

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన దుర్గమాంబను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మంగళవారం దర్శించి, పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కూడా అయిన బుల్లిబాబు ఉగాది పురస్కరించుకుని అమ్మవారికి పూలమాల వేసి పూజలు చేశారు. ఉగాది సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



దుర్గమాంబ సన్నిధిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ శ్రేణులు

సమైక్యతను చాటేలా గ్రామదేవతల పండగలు

కోటవురట్ల : గ్రామ దేవతల పండగలు సమైక్యతను చాటుతాయని పాయకరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పేటలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం స్థానికులతో ముచ్చటించారు. ఆలయాల సందర్శన మంచిని, సన్మార్గాన్ని కలిగిస్తాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్ సీతారామరాజు, సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ రాంబాబు పాల్గొన్నారు.

క్రోధం వదిలి.. కూరిమి కలిగి



ప్రత్యేక అలంకరణలో గవరపాలెం కనకదుర్గ అమ్మవారు

- ఊరూ వాడా ఉగాది శోభ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

అనకాపల్లి: క్రోధి నామ ఉగాది వేడుకలు మంగళవారం ఊరూవాడా ఘనంగా జరిగాయి. క్రోధం కలిగించేదిగా చెప్పుకునే 'క్రోధి'నామ సంవత్సరంలో ప్రజలెల్లా కూరిమితో మెలగాలని ఆలయాల్లో అర్చకులు పూజలు జరిపారు. పంచాంగ పఠనాలతో ఆలయాల్లో సందడి నెలకొంది.

- స్థానిక తాకాశివీధి నూకాంబిక ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పంచాగ పఠనం చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, నివేదిత దంపతులు అమ్మవారిని, 83వ వార్డు లక్ష్మీదేవిపేటలో మల్లమ్మతల్లిని, మండలంలోని బట్లపూడి పంచాయతీ నాయుడుపేటలో గాటీలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. వీరికి తాకాశివీధి నూకాంబిక ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తాకాశి రాజేష్ శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, ట్రస్టు బోర్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో ఉగాది వేడుకల్లో భాగంగా అమ్మవారికి తెల్లపూలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అర్చకులు పంచాంగంలో రాశిఫలాలను వివరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.
- వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరుడు, గణపతి, షిర్డీసాయిబాబా, కన్యకాపరమేశ్వరి, సిద్ధిలింగేశ్వరుడు, ఉమారామలింగేశ్వరుడు, భోగలింగేశ్వరుడు, వేంకటేశ్వరస్వామి, చౌడేశ్వరస్వామి, సూర్యనారాయణ, సత్యనారాయణస్వామి దేవాలయాల్లో, వేల్పులవీధి, కుంచావారివీధి, గవరపాలెం, గౌరీపరమేశ్వరుల ఆలయాల్లో ఉగాది వేడుకలు పురస్కరించుకుని అర్చకులు పంచాంగ పఠనం చేసి ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.
- జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి చింతామణి గణపతి దత్త క్షేత్రంలో ఉగాది వేడుకలు జరిగాయి. కొత్త ఏడాదిలో ప్రతీ ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని అర్చకులు పూజలు జరిపి, అనంతరం పంచాంగ పఠనం చేశారు.
- స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో యోగా శిక్షణ అనంతరం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పతంజలి యోగా సమితి తెలుగు రాష్ట్రాల యువజన అధ్యక్షుడు స్వామి అశోక్‌ఆర్యా మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను వివరించారు. దేహమే దేవాలయంగా చూసుకుని ప్రతీ రోజూ యోగా సాధనతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు.

అనంతరం ఋగ్వేద యాగం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి శ్రీకాళహస్తి తెలుగు సంవత్సర పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యోగా సభ్యులు పెంటకోట సుబ్రహ్మణ్యం, బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ధ కాశీవిశ్వనాథ్, బి.శ్రీనివాసరావు, జి.మంగయ్య, కర్రి గంగాధర్, కాండ్రేగుల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కస్పావీధి, పూసర్ల వీధి, కనకమహాలక్ష్మి వీధి రామాలయాల్లో పంచాంగ పఠనం చేశారు. ఈ ఏడాది దేశ స్థితిగతులు, రాజకీయాలు, ప్రభుత్వాలు ఎలా ఉంటాయి? ఏ పంటల సాగుకు అనుకూలం, వర్షాల పరిస్థితి, రాశిఫలాలు తదితర అంశాలను పురోహితులు వివరించారు.



తాకాశివీధి నూకాంబిక చిత్రపటాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్‌కు అందిస్తున్న రాజేష్



చింతామణి గణపతిని దర్శించుకుంటున్న భక్తులు



దత్త క్షేత్రంలో చింతామణి గణపతికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



లక్ష్మీదేవిపేటలోని మల్లమ్మతల్లి పేరంటాళ్లమ్మ సన్నిధిలో భరత్‌కుమార్ దంపతులు



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీకాళహస్తి, స్వామి అశోక్‌ఆర్యా